క్లుప్తంగా

సహకార సంఘ సూత్రాలు పాటిస్తే లాభాలు

కొత్తూరు: రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు సహకార సంఘం సూత్రాలు పాటిస్తే లాభాలు చేకూరుతాయని స్థానిక వెలుగు ఎన్జీవో కార్యదర్శి బి.సంజీవరావు అన్నారు. మండలంలోని మహసింగి గ్రామంలోని వెలుగు ఎన్జీఓ కార్యాలయంలో అడవితల్లి రైతు ఉత్పత్తి సంఘం సభ్యులకు బిజినెస్ డవలప్‌మెంట్ ప్రణాళికలపై ఒక్కరోజు శిక్షణను గురువారం నిర్వహించారు. మార్కెంటింగ్ ముఖ్య ఉద్దేశాన్ని సభ్యులకు వివరించారు. మార్షిఎస్ పైనాపిల్ రకం సాగు విధానాన్ని పీహెచ్‌ఓ గణేష్ గిరిజన రైతులకు వివరించారు. కర్లెమ్మ విలేజ్ ఉద్యానవన సహాయకులు దివాకర్, వెలుగు ఎన్జీఓ రిసోర్స్ పర్షన్స్ పాల్గొన్నారు.

38 మంది ఆక్రమణదారులకు నోటీసులు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని డోల చెరువు, బారికివాని చెరువు గట్ల ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు గురువారం నోటీసులు జారీచేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు గట్లపై అక్రమ కట్టడాలను నిర్మించిన 38 మందికి మొదటి విడతలో గుర్తించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వారికి నోటీసులు ఇస్తున్నామని వీఆర్వో పార్వతి తెలిపారు. కొంతమందికి నోటీసులు అందజేశామన్నారు. మరికొంత మంది ఆక్రమణదారులు అందుబాటులో లేనందున వారికి శుక్రవారం నోటీసులు ఇస్తామన్నారు. నోటీసులు అందుకున్నవారు నిర్మాణాలను స్వచ్ఛందగా పది రోజుల్లో తొలగించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ



మెళియాపుట్టి: స్థానిక ఎస్ఐగా పి.రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మండలం కావడంతో మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచుతామన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రితో విద్యార్థులు

హిరమండలం: మండలంలోని కొమనాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 72 మంది విద్యార్థులకు ఆ గ్రామ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శంకరరావు, మన్మధరావు నోట్‌బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు, కంపర్స్ బాక్స్‌లు తదితర విద్యా సామగ్రిని హెచ్‌ఎం జి.శ్రీప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చిన్నారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో ఇటీవల ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పాతపట్నం సీఐ నల్లి సాయి గురువారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు చాలామంది నిబంధనలు పాటించడం లేదన్నారు. సరిహద్దు ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని పేపర్లు దగ్గర పెట్టుకోవాలని, పరిమితికి మించిన లోడుతో వాహనాలను నడపద్దని తెలిపారు. ఎస్ఐ లావణ్య, పోలీసులు పాల్గొన్నారు.

గురువులు సమాజ నిర్దేశకులు



సంహాద్రినాయుడును సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

జలుమూరు: గురువులు సమాజ నిర్దేశకులని పలువురు వక్తలు అన్నారు. గురువారం రాణ పంచాయతీ పరిధి కొత్తపేట గ్రామానికి చెందిన బలగ శ్రీనివాసరావు (ఉత్తమ గురువు), విశాఖపట్నం ఏవీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడును ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న గోవిందరావు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అందుతున్న విద్యతోపాటు సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గోవిందరావు విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల చిన్నారులకు సమగ్ర శిక్ష ద్వారా విద్య, ఫిజియోథెరపీ, ట్రాన్స్‌పోర్టు, అలవెన్స్, స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్ వంటివి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు ఎస్.సీతంనాయుడు, గోవిందరావు, ఆయా శోభారాణి ఉన్నారు.

• అవస్థలు



నరసన్నపేట నుంచి ఒడిశాలోని మోహన వెళ్లే జాతీయ రహదారిపై సారవకోట మండలం వడ్డినవలస పెట్రోల్ బంకు సమీపంలో వర్షం నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో ఇక్కడ కల్వర్టు నిర్మించాల్సి ఉన్నా.. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించలేదు. వర్షాలు పడే సమయంలో సమీపంలో ఉన్న పొలాల నుంచి నీరు రోడ్డుపై చేరి నిల్వ ఉంటుంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు, సమీప గ్రామస్తులు కోరుతున్నారు. – సారవకోట



• అప్రమత్తం

సీజనల్ వ్యాధులపై అప్రమతగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. గురువారం జోనంకి పంచాయతీ పరిధిలోని కె.ఎల్.ఎన్.పేట, అబ్బాయిపేట గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వేడి ఆహారం, తాగునీరు తీసుకోవాలన్నారు. జ్వరం, దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి చినరాజులు, సీహెచ్‌ఓ పద్మావతి, నాగేశ్వరరావు, చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు. – జలుమూరు

• తగ్గుముఖం



పాతపట్నం మండల కేంద్రంలో గల మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించిన మహేంద్రతనయ గురువారం నాటికి తగ్గుముఖం పట్టింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై నుంచి స్వల్పంగా నీరు పారుతోంది. గత నాలుగు రోజుల నుంచి పాతపట్నం నుంచి కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు కాజ్‌వే పైనుంచి రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడ్డారు. పోలీసులు నదికి ఇరువైపులా కాపలా ఉన్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. – పాతపట్నం

చిగురించిన ఆశలు

- ఇటీవల కురిసిన వర్షాలకు శివారు, మెట్ట పొలాల్లో చేరిన నీరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

నరసన్నపేట:

ఇటీవల కురిసిన వర్షాలతో నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కాలువల శివారు భూములు, మెట్ట భూముల్లో వరి పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాభావంతో సాగునీటికి ఇబ్బందిగా ఉండేది. కాలువల ద్వారా నీరు ఎప్పుడు వస్తుందా అని రైతులు ఎదురుచూసేవారు. ఈ నెలలో వర్షం అనుకూలంగా కురవడంతో సాగు నీటికి ఇబ్బంది లేదు. జూన్, జులై, ఆగస్టు నెలల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది. వరి పంటలు ఎండిపోతాయని, పెట్టిన పెట్టుబడి పో తుందని రైతులు ఆందోళన చెందారు. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు సాధారణం కంటే రెట్టింపు వర్షం కురిసింది. ఈ ప్రభావం నెలాఖరు వరకు ఉండి, వచ్చే నెలలో రెండు వర్షాలు అందితే వరి పంట చేతికి అందివస్తుందని రైతులు అంటున్నారు. నరసన్నపేటమండలంలో గోపాలపెంట, పోతయ్యవలస, మడపాం, మాకివలస, కామేశ్వరిపేట, లుకలాం, అంబోజీపేట, కొత్త పోతలవలస కాలువ శివారు గ్రామాలు. ఈ గ్రామాల్లో ఎప్పుడూ సాగునీటికి ఇబ్బందే. పోలాకి మండలంలో గాతలవలస, మగతపాడు, సత్రవుపేట, ఓదిపాడు, దువ్వవలస, గంగివలస, రాజపురం, జలుమూరు మండలంలో రామకృష్ణాపురం, అందవరం, గొల్లపేట, ఉప్పరిపేట, పర్లాం, సారవకోట మండలంలో రామకృష్ణాపురం, కూర్మనాథపురం, కేజేపురం, బెజ్జి కాలువ శివారు గ్రామాలు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పోతయ్యవలస వద్ద ఆశాజనకంగా ఉన్న వరి పంట

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్ (12 వరకు)
నరసన్నపేట	58.4	153.2	157.0	148.4
పోలాకి	59.6	135.2	179.6	169.2
జలుమూరు	87.2	200.2	202.4	126.8
సారవకోట	126.2	206.2	303.8	129.6

వర్షాలు కలిసి వచ్చాయి



మండలంలో కాలువ శివారు భూములు మావి. ఎప్పుడూ సాగునీటికి ఇబ్బందే. కాలువ ద్వారా నీరు వస్తే ఒట్టు. ఏటా నాట్లు వేయడం, నీరులేక ఎండిపోయి పోవడం జరుగుతుంది. ఈ సీజన్‌లో మాత్రం ఇప్పటి వరకు వర్షాలు కలిసి రావడంతో పైర్లు బాగున్నాయి.
– బొబ్బాది ఈశ్వరరావు, రైతు, గోపాలపెంట

సాగునీటికి ఇబ్బంది రాలేదు



ఏటా సాగునీటికి ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు వర్షాలు కలిసి రావడంతో అనుకూలంగా ఉంది. పైర్లు బాగున్నాయి. కాలువ శివారు భూములకు నీరు లేక ఇబ్బంది పడేవారం. మరో నెల రోజులు వరుణ దేవుడు ఇలాగే సహకరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.
– వాకముళ్ల చక్రధర్, రైతు, కామేశ్వరిపేట

సమస్యలపై నిలదీత



సభ దృష్టికి సమస్యలు తీసుకొస్తున్న సర్పంచ్ షణ్ముఖరావు

సారవకోట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూగుపురం పంచాయతీలో 2014–19లో నిర్మించిన ఇళ్ల స్థితిగతుల గూర్చి సర్వే చేపడుతున్నారని, దీనిపై తనకు సంబంధిత అధికారులు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని సర్పంచ్ ఇప్పె షణ్ముఖరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ నిధుల నుంచి రూ.1.5 లక్షలు వెచ్చించి సవరబొంతులో కల్వర్టు నిర్మించామని, 6 నెలలు కావస్తున్నా ఇంజినీరింగ్ అధికారులు పనిని పరిశీలించి బిల్లు మంజూరు చేయడం లేదని చిన్నకిట్టాలపాడు సర్పంచ్ జన్ని సంధ్య ఆరోపించారు. తమ సచివాలయ పరిధిలో ఉన్న జేఎల్ఎం అందుబాటులో లేకపోవడంతో గ్రామంలో పలుచోట్ల వీధి దీపాలు కూడా వేయించుకోలేక పోతున్నామని తెలిపారు. ఇదే సచివాయం పరిధిలో పశుసంవర్ధకశాఖ ఉద్యోగి గ్రామాలకు వెళ్లి పశువులకు చికిత్స అందించడం లేదని ఆరోపించారు. చీడిపూడిలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్త మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సభ్యుడు నిక్కు కృష్ణారావు కోరారు. సారవకోటలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు సభ దృష్టికి తీసుకొచ్చారు. బుడితిలోని లింగువాని చెరువు గట్టుపై 400 మొక్కలు నాటారని, రక్షణ లేక ఆ మొక్కలు చనిపోతున్నాయని బుడితి ఎంపీటీసీ మురళి ఆరోపించారు. మాకువ పంచాయతీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిపై అధ్యాయనం చేయాలని కోరారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఐటీడీఏ అధికారులు హాజరుకాలేదని, సంబంధిత అధికారులు హాజరయ్యేలా చూడాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారామిలటరీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారామిలటరీ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: పారామిలటరీ బలగాల్లో పనిచేస్తున్న సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ఎంపీని కలిశామన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించారని పారామిలటరీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి కోట్నీ లక్ష్మణరావు తెలిపారు. పారామిలటరీ అసోసియేషన్ న్యాయ సలహాదారు జె.వంశీకృష్ణతో కలిసి ఎంపీని కలిసినట్లు చెప్పారు. పదవీ విరమణ పొందిన, సర్వీస్‌లో ఉన్న సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సీఏపీఎఫ్‌ల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా కేపీకేబీ కాంటీన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వాలి



దొంపాకలో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగయ్య

జలుమూరు: స్థానిక ట్రాక్టర్లతోపాటు లేబర్‌కు ఇసుక రీచ్‌లలో పని చేసేందుకు అవకాశం ఇవ్వాలని అంధవరం, దొంపాక గ్రామస్తులు శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్యను కోరారు. గురువారం ఆయా గ్రామాల్లో ఇసు రీచ్‌ల కోసం ప్రజాభిప్రాయం సేకరణపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఉప్పరపేట వద్ద కూలిన వంతెన స్థానంలో కొత్తది నిర్మాణం చేపట్టాలని, రోడ్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ, పర్యావరణశాఖ ఈఈ శంకర్ నాయక్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, సర్పంచ్ వాన రాజు, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అచ్చనాపురం గిరిజనులు

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ కాలువకు భూములు ఇచ్చినవారికి న్యాయం చేయాలని మండలంలోని అచ్చనాపురం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు కోరారు. గురువారం తహసీల్దార్ హనుమంతరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. గిరిజనులు మాట్లాడుతూ 44 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లు ఖాళీచేయాలని అధికారులు సూచించారని, పరిహారాలు మాత్రం ఇవ్వలేదన్నారు. భూములు సేకరించిన వాటికి సైతం అతి తక్కువ పరిహారం ఇచ్చారన్నారు. ఇదే ప్రాజెక్టులో నిర్వాసితులైన దాసుపురం, చీపురుపల్లి గ్రామాలకు చెందిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీలు 2013 చట్టం ప్రకారం అందించారనీ.. అచ్చనాపురం నిర్వాసితులకు మాత్రం తక్కువ పరిహారాలు ఇవ్వడం బాధాకరమన్నారు. మరోసారి గ్రామాన్ని సందర్శించి, ప్యాకేజీల వివరాలు సమగ్రమంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. డీ పట్టా భూములకు ఎటువంటి పరిహారం అందించలేదన్నారు.

బై.. బై.. గణేశా..



హిరమండలం: వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్నకోరాడ, బ్యారేజీ సెంటర్, అంధవరపు, దేవరశట్టి, గాంధీనగర్ వీధుల్లోని వినాయక మండపాల్లో గల విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఊరేగించి వంశధార నదిలో నిమజ్జనం చేశారు. యువత డ్యాన్స్‌లతో సందడి చేశారు.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీలోని బర్రిపేటలో వినాయక విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. చల్లంనాయుడు కాలనీలోని వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేపట్టారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



రావులవలసలో వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం పాల్గొన్నారు. మండలంలోని రావులవలసలో జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, ఎం.కృష్ణ, మూకళ్ల కృష్ణ, బువ్వాజీ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

పాతపట్నం/సరుబుజ్జిలి/బూర్జ: పాతపట్నం మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నీలమణిదుర్గ ఆలయం వద్ద భారీ అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కుమ్మరివీధిలో అన్నప్రసాదాలను భక్తులు స్వీకరించారు. సరుబుజ్జిలి మండల పురుషోత్తపురంలోని పెద్దవీధి యూత్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. బూర్జ గ్రామంలోని హరిజన వీధి వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.



సరుబుజ్జిలి: అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



బూర్జ: అన్నప్రసదాలు స్వీకరిస్తున్న భక్తులు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి డివిజన్ ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టు కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడతామన్నారు. హిరమండలం, పాతహిరమండలం, సుభల య, నౌగుడ తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పొందూరు మండలంలో

పొందూరు: మండలంలోని కింతలి, లోలుగు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యనాయుడు, ఏఈ దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకనటలో తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనులు చేపడతామన్నారు. ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు కనిమెట్ట, తోలాపి, బురిడికంచరాం, నందివాడ, కేసవదాసుపురం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వైద్యుల నిరసన

సరుబుజ్జిలి: ఇన్ సర్వీస్ కోటాను తగ్గించి ప్రభుత్వం అనాలోచితంగా ఇచ్చిన జీఓ 85 వెంటనే రద్దు చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సంతోష్‌కుమార్, సాహితి డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ కోటాను క్లినికల్ 30, నాన్‌క్లినికల్ 50 శాతం కోటా యథా ప్రకారం అమలు చేయాలని తెలుపుతూ గురువారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈఓ వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. ఈ నెల 18 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే డాక్టర్లకు ఉన్నత చదువుల్లో కల్పించే అవకాశాలకు ఈ ప్రభుత్వం గండి కొడుతుందని మండలంలోని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఎ.లక్ష్మీదీప్ అన్నారు. గురువారం నల్ల బ్యాడ్జీ ధరించి విధులకు హాజరయ్యారు. జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్‌ఎల్ కో ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఏటీఎం పిన్, అకౌంటు వివరాలను అడిగితే చెప్పవద్దని సూచించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకాన్ని 18 నుంచి 50 ఏళ్లలోపు వారికి వర్తిస్తుందన్నారు. సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎవరైనా సహజ మరణం పొందితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి వర్తిస్తుందని, సంవత్సరానికి రూ.20 ప్రీమియం చెల్లించాలన్నారు.

ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే రూ.రెండు లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మున్సిపల్ డీఎంసీ కె.రాజేష్, సీఓ కె.వినోద్, ఆర్పీ భాగ్యలక్ష్మి, సీఎఫ్‌ఎల్ కో ఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలి

పొందూరు: జీఓ 117ను ప్రభుత్వం రద్దు చేసేంత వరకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (డీటీఎఫ్) నిరంతర పోరాటం చేస్తామని జిల్లా కౌన్సిల్ సభ్యుడు గండెం రామారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తయినా జీఓ 117ను రద్దు చేయడంలో తాత్సారం చూపుతోందన్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, డీఏలు కొత్త పీఆర్‌సీ ప్రకటన, ఐఆర్ ప్రకటన, సీపీఎస్ రద్దు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

18, 19 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

సరుబుజ్జిలి: ఈనెల 18, 19వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బాల, బాలికలకు, అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రింగ్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 18న బాలురకు, 19న బాలికలకు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం నుంచి సంతకంతో ఉన్న ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు.

విరాళాల సేకరణ

పాతపట్నం: విజయవాడ వరద బాధితులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని అమర జ్యోతి పాఠశాల హెచ్‌ఎం ఎం.సోమేశ్వరరావు అన్నారు. గురువారం పాతపట్నం మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొట్టవలసలో..

సరుబుజ్జిలి: విజయవాడ వరద బాధిత కుటుంబాలకు రొట్టవలస కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్ తరఫున విద్యార్థులు, అధ్యాపకులు విరాళాలు అందజేశారు. ఈ నగదను సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందజేయనున్నట్లు కరస్పాండెంట్ బెవర హరినారాయణ, ప్రిన్సిపాల్ బెవర కృష్ణవేణి తెలిపారు.